క్లుప్తంగా

రేణుక ఎల్లమ్మకు విశేష పూజలు



పూజలందుకుంటున్న రేణుక ఎల్లమ్మ దేవి

కోసిగి: మండల కేంద్రంలో వెలసిన రేణుక ఎల్లమ్మ దేవికి విశేష పూజలు చేపట్టారు. శూన్య అమావాస్య శుక్రవారం అమ్మవారి పర్వదినం పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేకువ జాము నుంచి కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ, మహామంగళ హారతులు చేపట్టి ప్రత్యేక పూజలు కానిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కొందరు భక్తులు ఆలయ ప్రాంగణంలో నైవేద్యం తయారుచేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

రాఘవేంద్రుల సన్నిధిలో కేంద్ర మంత్రి



మంత్రి ప్రహ్లాద జోషికి స్వాగతం పలుకుతున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం: సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషి శుక్రవారం మంత్రాలయం విచ్చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య నేతృత్వంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. మంత్రి శ్రీమఠానికి చేరుకోగా మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. రాత్రి కుటుంబ సమేతంగా శ్రీ మఠాన్ని సందర్శించారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆయనకు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫలపూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు.

వడ్డే ఓబన్నకు నివాళి

ఆదోనిఅర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఆదోని పట్టణంలో శుక్రవారం అఖిల భారత వడ్డే ఓబన్న సేవా సమితి కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య నాయకులు, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి నాయుడు, ఆదోని మండల బీసీ అధ్యక్షులు చిన్నబసప్ప, బీజేపీ ఓబీసీ మోర్చ కర్నూలు జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాస్, ఆదోని అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, వడ్డేర సంఘం నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 217వ జయంతి వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర సంఘం నాయకులు అంజి, వీరన్న, పులికొండ నాగరాజు, మోహన్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగు

ఆదోనిరూరల్: మండలంలోని హన్వాల్ గ్రామంలో డ్రెయినేజీలు నిండిపోయి మురుగునీరు ఎక్కడికక్కడ రోడ్లపై, ఇళ్ల ముందు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కె.లింగన్న, మండల నాయకులు బాషా, శాఖ కార్యదర్శి దస్తగిరిబాషా అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని 1వ వార్డు, పీర్ల మసీదు ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. సచివాలయ అధికారులకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే డ్రెయినేజీని బాగు చేసి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూడాలన్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ప్రముఖులు



దర్గాలో ఫాతెహాల్లో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 404వ జయంతి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్రం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కర్ణాటక యాదగిరి ఎమ్మెల్యే చెన్నరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహాలు నిర్వహించారు. వీరికి ధర్మకర్త మున్నపాషా చిష్తీ స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానించారు. అలాగే స్థానిక వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ప్రహ్లాదచారి, సర్పంచ్ పాల్‌దినకర్, యువ నాయకులు దొట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వాహకుడు సయ్యద్ దూద్‌బాష తదితరులు స్వామి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

- వైఎస్సార్‌సీపీతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- చంద్రబాబునాయుడు 14 ఏళ్ల పాలనలో చేసిందేమీ లేదు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు



హాజరైన ప్రజలు

ఆదోనిటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మదిలో చెరగని స్థానం సంపాదించుకున్నారని, ఆయన తనయుడు వైఎస్ జగనన్న రాష్ట్రాభివృద్ధి, నవరత్నాల పథకాలతో 5 కోట్ల మంది ప్రజల ఇంట ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. 14 ఏళ్ల చంద్రబాబునాయుడి పాలనలో చెప్పడానికి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డు బొబ్బలమ్మగుడి ఏరియాలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కీర్తన కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. అనంతరం 33వ వార్డులో రూ.19.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి ఫలాల డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత టీడీపీ ఐదేళ్ల పాలనలో చంద్రబాబుకు ప్రజా సంక్షేమం పట్టలేదని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో కల్లిబుల్లి మాటలతో ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్‌ను సీఎం చేయడమే చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. గతంలో పింఛన్ పొందాలంటే పది రోజులు అధికారులు, రచ్చబండల చుట్టూ తిరిగాల్సివచ్చేదని, నేడు తెల్లవారకముందే తలుపుతట్టి వలంటీర్లు పింఛన్లను అందజేస్తున్నారని, ఇంతకన్నా మార్పు ఏం కావాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఏపీకి మళ్లీ జగనే సీఎం కావాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా రాష్ట్రంలో సొంతిల్లు లేని ప్రతిఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. ప్రజలను రెచ్చగొట్టేవిధంగా ప్రతిపక్షాలు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని వారి మాటలు నమ్మవద్దన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని రెట్టింపు పథకాలు అందుకుందామని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, పట్టణాధ్యక్షులు దేవా, కౌన్సిలర్లు రామలింగేశ్వరయాదవ్,సురేష్, మమ్మత్తుస్వామి, చలపతి, చిన్న, ఫయాజ్‌అహ్మద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 32వ వార్డు బోయగేరి, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని కౌన్సిలర్ కీర్తనకిషోర్, చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, పట్టణాధ్యక్షులు దేవా, కౌన్సిలర్‌లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుకున్నారు. శుక్రవారం 185 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను వివరిస్తూ ముందుకు సాగారు. మహిళలు, వృద్ధులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమదృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఇళ్ల మధ్యలో ఉన్న పశువుల కమేళాను మరో ప్రాంతానికి తరలించాలని బోయ గేరి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న కమిషనర్‌తో సమస్యపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఆదోనిటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదోని మున్సిపాలిటీ, మెప్మా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పొదుపు సంఘాల మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఎం జగనన్న హ్యాపీ సంక్రాంతి, తాగునీటిని పొదుపుగా వాడుకుందాం వంటి నినాదాలతో ఆకట్టుకునేలా ముగ్గులు వేశారు. అలాగే అమ్మ ఒడి, జగనన్న చేదోడు, జగనన్న చేయూత పథకాలకు సంబంధించిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 150 మంది పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపికచేశారు. ఈనెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. మెప్మా ప్రాజెక్టు అధికారిణి సనాభాను, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. డీ1, డీ2, డీ3, ఇండోర్, ఇండస్ట్రియల్, రాంజల, బైచిగేరి, దొడ్డనగేరి, రూరల్ ఈస్ట్, రూరల్ వెస్ట్, సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



తిరుమలనగర్ కొట్టాల్ ప్రాంతంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండిగిరి పంచాయతీ పరిధిలోని తిరుమలనగర్ కొట్టాల్, ఆంజనేయ కాలనీ, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, మీ సమస్యలు ఏమిటి అవ్వా, తాత, అక్కా, అన్న, తమ్ముడు, చెల్లెమ్మ అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పథకాలు కొనసాగాలంటే మరోసారి సీఎం జగనన్నకు ఓటు వేసి గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, వినోద్‌రెడ్డి, కోటిరెడ్డి, సురేష్, సన్నీ, శ్రీనివాసరెడ్డి, గుర్రెడ్డి లక్ష్మిరెడ్డి, ధనుంజయరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



నేడు- నదిచాగి నుంచి బాపురం వరకు నిర్మించిన రోడ్డు



నాడు - గతంలో రోడ్డు దుస్థితి

కౌతాళం: దశాబ్దకాలం నుంచి ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజల కల నేరవేరింది. మండల పరిధిలోని బాపురం నుంచి నదిచాగి గ్రామం వరకు రోడ్డు గుంతలు ఏర్పడి దారుణంగా ఉండేది. ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు ప్రజలు ఇన్నో ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నిర్మించాలని గత టీడీపీ హయంలో ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి నదిచాగి నుంచి వయా డంబలదిన్నె, అగసలదిన్నె, లింగాలదిన్నె, కాత్రికి గ్రామాల మీదుగా బాపురం వరకు 8 కి.మీ రోడ్డును రూ.2 కోట్లతో నిర్మించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోసిగి: రోడ్డంతా గుంతలమయం. ఆ దారిలో ప్రయాణం చేయాలంటే నరకయాతన ఉండేది. టీడీపీ ప్రభుత్వం హయాంలో మంత్రాలయం మండలం మాలపల్లి–డి.బెళగల్ మీదుగా కోసిగి వరకు డబుల్ రోడ్డు వేయాలని నిర్ణయించింది. అయితే కేవలం దొడ్డి బెళగల్ వరకు మాత్రమే రోడ్డు వేసి వదిలేశారు. 4.50 కి.మీ. దూరాన్ని పూర్తి చేయకపోవడంతో రోడ్డంతా గుంతమయమై నరకయాతన అనుభవించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఎన్‌ఐడీఏ (నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్) నిధులు రూ.5.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యంగా మారింది. ప్రమాదరహిత రవాణా సాగిస్తూ హాయిగా గమ్యాలు చేరుకుండటంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నేడు - రాకపోకలకు సౌకర్యంగా మారిన కోసిగి - డి.బెళగల్ రోడ్డు



నాడు - గతుకులమయంగా ఉన్న రోడ్డు

యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలి



బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

కౌతాళం: యువకులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేపట్టాలని కామవరం శివరామ దూత మఠం పీఠాధిపతి గురు అవ్యక్తానంద స్వామి, నిత్యశుద్ధ చైతన్య స్వామి పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని కామవరం గ్రామంలో గురు వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరసేనరెడ్డితో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. దేశ ఖ్యాతిని, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా గైడ్స్ పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆదోనిఅర్బన్: స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఆదోని పట్టణంలో యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ మోహన్, యువజన సంఘం నాయకులు మారి, వినయ్, వెంకటేష్, రాము, రంజిత్, భాస్కర్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సీఐకు సన్మానం



సీఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎస్‌ఐలు

మంత్రాలయం: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు సాధారణ బదిలీల్లో భాగంగా దేవనకొండ స్టేషన్‌కు నియమితులయ్యారు. బదిలీపై వెళ్లనున్న ఆయన్ను శుక్రవారం స్థానిక పోలీసులు ఘనంగా సన్మానించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఎస్‌ఐలు మాట్లాడుతూ సీఐ శ్రీనివాసులు సేవలను కొనియాడారు. మంత్రాలయం ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు, మాధవరం ఎస్‌ఐ కిరణ్‌బాబు, ఆలయ స్టేషన్ ఎస్‌ఐ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని ఇస్వీ కొండల్లో మద్యం తయారు చేసి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఆదోని పట్టణం బోయగేరికి చెందిన నాగలింగ 20 లీటర్ల నాటుసారాను స్కూటీపై తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన మద్దిలేటి 10 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ చెప్పారు.

సురక్షతో గ్రామీణులకు మెరుగైన వైద్యం



బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్షతో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి వైద్య సేవలతో పాటు మందులు అందిస్తున్నట్లు తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బరాజులు అన్నారు. మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంను శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ సిద్దేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రోగులు అధికంగా తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్, హిమగ్లోబిన్, మలేరియా, టీబీ, డెంగ్యూ, యూరిన్ టెస్ట్, ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎంపీడీఓ, సర్పంచ్‌లు మాట్లాడుతూ..ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆయా కుటుంబాల వారికి ఏదైనా అనారోగ్యం వస్తే రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని స్థాయిల్లో సేవలు అందించేలా విప్లవాత్మక చర్యలు చేపట్టారని తెలిపారు. వైద్యులు దినేష్, రజిత, ప్రతిభ, ఆప్తాలిక్ అసిస్టెంట్ మంజుల, గ్రామ నాయకులు బసప్పగౌడ్, ఖాజా, గుడిసిలి బసప్ప, ఆనందు, మారెప్ప, కిష్టప్ప, అన్నమయ్య పాల్గొన్నారు.


శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



డి.బెళగల్‌లో ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్

కోసిగి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రసాద్ హెచ్చరించారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ ప్రసాద్, ఎస్‌ఐ సతీష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి మండలంలోని డి.బెళగల్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసి ఎన్నికల విషయాలు, రహదారి ప్రమాదాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. క్షణికావేశానికిలోనై గొడవలు పడడం, కక్ష సాధింపులకు పాల్పడితే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని సూచించారు. పంతానికి పోయి జీవితాలు, కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. పోలీస్ సిబ్బంది వెంట ఉన్నారు.

కురువలకు అన్యాయం చేస్తే సహించం



మాట్లాడుతున్న టి.శ్రీనివాసులు

ఆదోనిటౌన్: కురువలకు రాజ్యాధికారం కల్పించడంలో వివిధ పార్టీలు అన్యాయం చేస్తున్నాయంటూ కురు వ సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న ఆరోపించారు. శుక్రవారం స్థానిక భీమాస్ ఫంక్షన్ హాలులో వారు మాట్లాడారు. జిల్లాలో 5 లక్షల మంది కురువలు ఉన్నారని, వివిధ రాజకీయ పార్టీలు కురువల సంఖ్యను తక్కువగా చూపుతూ అణిచివేసే ధోరణి అవలంభిస్తున్నాయన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కురువలకు ఉమ్మడి జిల్లాలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, నాయకులు సురేంద్ర, పక్కీరప్ప, వెంకటేశులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE IV Addl. District Judge:: KURNOOL
O.S. No. 108/2017

G.Giridhar .... వాది
-Vs-
S.Chandra Mohan Reddy & Others .... ప్రతివాదులు

12,14 మరియు 16,17వ ప్రతివాదికి నోటీసులు

(12) Triveedhi Manikanta, S/o Mallikarjuna, H.No. 11-86, Main Bazar, Kambam Post, Prakasam District.

(14) N.Lakshmi W/o Naresh Kumar Reddy, H.No. 4-384-32, Sujendra Nagar, Mantralayam (P), Kurnool District.

(16) Battula Rajasekhar Reddy, S/o Battula Nagireddy, H.No. 80-112-7-9-1, Endowment Colony, Kurnool City

(17) Reddy Vamsi Krishna Reddy C/o Reddy Venkata Rangareddy, H.No. 2/2, Kapa Street, Kandahall (V), Peddakaduburu (M), Kurnool District.

పైన తెలిపిన వాది 12,14 మరియు 16,17వ ప్రతివాదులు అయిన మీపైన పై కోర్టులో దావాను దాఖలు చేసినారు. పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు నిమిత్తం 23-01-2024వ తేదీన వాయిదా వేసివున్నారు. పై దావాకు సంబంధించి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 23-01-2024 తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు ఖుద్దున కానీ, మీ వకీలు ద్వారా కానీ, హాజరై ఏమైన అభ్యంతరాలు వున్న యెడల తెలుపుకొనవలెను, లేని యెడల పై కోర్టు వారు పై దావాను మీ పరోక్షములో విచారించి తీర్మానించుదురని తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు వాయిదా 23-01-2024

యం.డి.వి.జోగయ్య శర్మ,
అర్జీదారు/ వాదిపరం న్యాయవాది, కర్నూలు

హోరాహోరీగా క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ఆదోని సెంట్రల్: ఆడుదాం–ఆంధ్ర క్రీడాపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల మైదానంలో శుక్రవారం ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓలు శివరాములు, శ్రీనివాసులు కబడ్డీ, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ఉంటాయని చెప్పారు. క్రీడాకారులు ప్రతిభను చాటుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 34 జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రతిభను చాటుకోవడానికి క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. కబడ్డీ పోటీల్లో ఆయా గ్రామాలకు చెందిన 26 జట్లు పాల్గొనగా బల్లేకల్లు జట్టు విన్నర్, కుప్పగల్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. క్రీడా పోటీల కో–ఆర్డినేటర్లు రామన్న, ఓబన్న పర్యవేక్షణలో ఆయా పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పోటీలను నిర్వహించారు.



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజా సమస్యలపై పోరాటం

ఆదోనిఅర్బన్: జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ సంఘటితంగా పోరాటం చేస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటశివనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీల కంఠ అన్నారు. శుక్రవారం స్థానిక మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ఇన్‌చార్జ్ అంకల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఉపేంద్రకుమార్, కోటియాదవ్, మల్లేష్‌గౌడ్, బీజేపీ అసెంబ్లీ కన్వీన ర్లు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన చిన్నలక్ష్మి శుక్రవారం కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న చిన్నలక్ష్మిని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు.